క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామివారు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలిమేలి మంగమ్మ సమేత శ్రీనివాసుడికి ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి కర్పూర హారతులు ఇచ్చారు. స్థానికులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: మండలంలోని హౌసింగ్ కాలనీల్లో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయించాలని ఎంపీడీఓ శకుంతల ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ డీఈ వాసుదేవరావుతో కలిసి మండల అధికారులు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హౌసింగ్ కాలనీ లేవుట్లతో పాటు లబ్ధిదారులు సొంత స్థలాల్లో నిర్మించుకుంటున్న గృహ నిర్మాణాలు మూడు నెలల్లో పూర్తయ్యేలా చూడాలన్నారు. అదే విధంగా ప్రజలు నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు వెంటనే వారి ఖాతాలకు చేరేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఈఓఆర్డీ సందీప్, మండల హౌసింగ్ ఏఈ సుమంత్ తదితరులు ఉన్నారు.

జంతువుల నుంచి సోకే వ్యాధులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యుడు

సి.బెళగల్: జంతువుల నుంచి వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సి.బెళగల్ పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ జునొసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జంతువులతో మసులుకోవాల్సిన విధానం, జాగ్రత్తలు, సోకే వ్యాధులు, వైద్య అంశాలను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా పెంపుడు జంతువుల ఆహార నియమావళి, పరిశుభ్రత అంశాలను తెలియజేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్య జీవనం సాధ్యమవుతుందని హెల్త్ సూపర్‌వైజర్ రాఘవయ్య అన్నారు. శనివారం మండలంలోని వర్కూరు హైస్కూల్‌లో నీటి కలుషితం, దోమల వల్ల సంక్రమించే వ్యాధులపై వైద్య సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాఘవయ్య మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. విద్యార్థులు కూడా తమ వంతుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, శుభ్రమైన ఆహారాన్ని భుజించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ రామక్రిష్ణ, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ శాఖ నెలకొల్పిన టవర్లపై 33కేవీ లైన్ లాగే పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ నాగప్రసాద్ తెలిపారు. శ్రీకృష్ణ కాలనీ, అశోక్ నగర్, లేబర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పంటకు చేటు.. పుడమికి పోటు

- పంటల్లో అవసరమైన మేరకే పురుగు మందులు
- ఇష్టానుసారం వినియోగిస్తే నేల, పంటకు నష్టం
- పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- రైతులకు వ్యవసాయాధికారులు సూచనలు

పంటల్లో చీడపీడల నివారణ కోసం పురుగు మందులు వాడటం సర్వసాధారణం. అయితే ఇష్టానుసారం పంటలకు మందులు పిచికారీ చేస్తే మంచి జరగడం అటుంచితే దుష్ప్రభావాలే ఎక్కువగా ఉంటాయి. కొందరు రైతులు మందుల దుకాణంలో ఏది పడితే అది కొనుగోలు చేసి వాడుతుంటారు. ఇలా చేయడం వల్ల భూమి సారాన్ని కోల్పోవడమే కాకుండా పంట నష్టపోయే ప్రమాదం ఉంది. ఆ పండ్లు, కూరగాయలు తీసుకోవడం వల్ల ప్రజలకు కూడా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సాగు వ్యయం కూడా పెరుగుతుంది. అవసరం మేరకు వినియోగిస్తే మంచిదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

గడివేముల: పంటలకు కాలానుగుణంగా ఏదో ఒక పురుగు ఆశిస్తుంటుంది. ఒకటి రెండు పురుగులు కనిపించగానే కొందరు రైతులు ఇష్టానుసారంగా పురుగు మందులు వాడేస్తున్నారు. ఇలా చేయడం వల్ల పైరుకు మేలు చేసే మిత్ర పురుగులు సైతం చనిపోతున్నాయి. పైరులో అధికంగా పురుగులు ఉన్నప్పుడు మాత్రమే నివారించేందుకు మందులను వినియోగించాలి. అతిగా వినియోగించడం వల్ల భూమి నిస్సారం అయి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. పిచికారీ సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. ఎప్పుడూ వాడే మందులే అని నిర్లక్ష్యం వహిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కొద్ది పాటి సూచనలు, సలహాలు పాటిస్తే రక్షణ పొందవచ్చు.

మందుల ఎంపిక కీలకం

ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. మరోవైపు పంటలపై పురుగులను నివారించేందుకు వివిధ కంపెనీలు ప్రచారం చేసుకుంటున్నాయి. ఏ మందు పడితే ఆ మందును పైరుపై పిచికారీ చేస్తే ఫలితం ఉండదు. గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణదారులు, కమీషన్ వ్యాపారులు ఏ మందు ఇస్తే అది వినియోగించడం వల్ల నష్టపోయే అవకాశం ఉంటుంది. గుర్తింపు పొందిన కంపెనీల పురుగు మందులనే వాడాలి.



బూజునూరు గ్రామంలో సోయాబీన్ పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

వ్యవసాయ అధికారులు సూచించిన మోతాదు మేరకే పంటలకు మందులు పిచికారీ చేయాలి.

మోతాదు మేరకు వాడాలి

వ్యవసాయాధికారుల సూచనలు మేరకే తెగుళ్లు, పురుగుల నివారణకు పురుగు మందులను వాడాలి. తక్కువ మందు వాడితే అది పనిచేయక పురుగులు చావవు. ఎక్కువ మందు వాడితే పంటకు నష్టం కలిగించడంతో పాటు ఆధిక వ్యయంతో పాటు రైతులకు పెట్టుబడి పెరుగుతుంది. పురుగులకు వ్యాధి నిరోధకశక్తి పెరిగి, తెగుళ్ల వ్యాప్తి ఉధృతమవుతుంది. పైరుపై ఎక్కువ సార్లు పురుగుమందులను పచికారీ చేయడం మంచిదికాదు.

జాగ్రత్తలు తప్పనిసరి

మందు డబ్బాల మూతలను నోటితో తీయకూడదు. మందు ద్రావణాన్ని డ్రమ్ములో కానీ, బకెట్లలో కానీ కలిపిన తర్వాతనే స్ప్రేయర్లలో నింపుకోవాలి. ముందులను నీటిలో కలిపేటప్పుడు చేతులకు గ్లౌజులతో పాటు రక్షణ దస్తులు ధరించాలి. ఆరోగ్యం సరిగా లేని వారు మందులు పిచికారీ చేయరాదు. కళ్లలో పడకుండా రైతులు కళ్లజోడు ధరించడం ఉత్తమం. అనుకోకుండా పురుగుమందు తుంపర్లు కంటిలో పడితే వెంటనే కళ్లను చల్లటి నీళ్లతో బాగా కడిగి వైద్యుడిని సంప్రదించాలి. శరీరంపై గాయాలు ఉన్నవారు మందులను పిచికారీ చేయరాదు. గాలికి వాలుగా పిచికారీ చేయడం ఎంతో ఉత్తమం. పచికారీ అనంతరం రెండు మూడు సార్లు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని. పశువుల మేత కోసం పెంచిన పైర్లలో మందుల వినియోగం నిషేధించాలి. కల్తీ మందులు వాడకూడదు.

సాగు వ్యయం పెంచుకోవద్దు



రైతులు అనవసరంగా ఎరువులు, పురుగుమందులు అధికంగా వాడటం వల్ల సాగు వ్యయం పెరిగిపోతుంది. అవసరమైన మేరకు మాత్రమే మందులు వాడాలి. ప్రభుత్వం అనుమతించిన ఎరువులు, పురుగు మందులను వాడాలి. ఆయా గ్రామాల్లోని రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. పంటలపై పిచికారీ చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి. –హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

హత్యాయత్నం కేసులో ఎనిమిది మంది అరెస్ట్

గడివేముల: మండలంలోని ఒండుట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంజర్ల రవీంద్రారెడ్డిపై ఈ నెల 2వ తేదీ హత్యాయత్నానికి పాల్పడిన ఎనిమిది మందిని శనివారం అరెస్టు చేసినట్లు ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామానికి చెందిన గంజర్ల గణేష్ రెడ్డి, తలారి రామగోవిందు, తలారి రామస్వామి, తలారి చంద్రన్న, తలారి రంగనాయకులు, తలారి చిన్న రంగస్వామి, మార్రెళ్ల శ్రీనివాసులు, మార్రెళ్ల వెంకటేశ్వర్లను రిమాండ్‌కు తరలించామన్నారు. ఎస్‌ఐ బీటీ వెంకట సుబ్బయ్య ఉన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



కిట్లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాణ్యం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మూడు విడతల్లో స్టూడెంట్ కిట్స్ పంపిణీ పూర్తి చేసినట్లు ఎంఈఓ-2 సుబ్రమణ్యం తెలిపారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫామ్, షూ, ఇతర సామగ్రి పంపిణీ చేసినట్లు చెప్పారు. శనివారం మూడో విడత కిట్లు రాగా ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి ఉండాల్సిందే

- హౌసింగ్ డీఈ ప్రభాకర్

ఓర్వకల్లు: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ డీఈ ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు జగనన్న కాలనీ-1లో వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను ఏఈ రామయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గతంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసిన వారికి సకాలంలో బిల్లులు చెల్లించామని తెలిపారు. మండలంలో మొత్తం 1843 ఇళ్లు మంజూరు కాగా 946 ఇళ్లు పూర్తయినట్లు వెల్లడించారు. ఇంకా 877 ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయినట్లు చెప్పారు. నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వచ్చే వారికి ఇసుక, కడ్డీ, సిమెంటు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. అనంతరం స్థానిక గోడౌన్ వద్ద నిల్వ ఉంచిన స్టాక్ వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆహ్లాదకర వాతావరణంలో బోధన

కల్లూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో పాఠాలు బోధించాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం స్వామిరెడ్డి నగర్, ఎంజీ నగర్ పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యాశాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలను బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. పాఠశాలలో పిల్లలకు విద్యార్థుల కిట్లను పంపిణీ చేశారు. అనంతర ఉర్దూ మీడియం పుస్తకాలను ఎంఆర్‌సీ భవనంలో పరిశీలించారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎంఈఓ

ఆర్జీఎంలో సిల్వర్‌జూబ్లీ వేడుకలు



చెర్మన్, గురువులతో 1995-99 బ్యాచ్ విద్యార్థులు

పాణ్యం: మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభమై 25 ఏళ్లు కావడంతో పూర్వ విద్యార్థులు శనివారం సిల్వర్‌జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులంతా కళాశాలలో కలుసుకుని మిత్రుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. తమ ఉన్నతికి కారణమైన కళాశాల చెర్మన్ శాంతిరాముడు, గురువులను ఘనంగా సన్మానించారు. ఆస్ట్రేలియా సావిక్ కార్పొరేషన్ ఫౌండర్ శ్రీకాంత్, బెంగళూరు గ్రీన్ ఎనర్జీ డైరెక్ట్ చక్రధర్‌రెడ్డి, ఓమన్‌కు చెందిన గోపిక్రిష్ణ, హైదరాబాద్ ఐటీపీఎస్ అండ్ సర్వే ఇన్ ఫౌండర్ నరేంద్రమోహన్, విజయ్‌పంజా, శిరీష, కరుణాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరు గ్రామంలో 95 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని రాజేంద్రగౌడ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు శనివారం తెలిపారు. అలాగే క్రిష్ణగిరి మండలం సంగాల గ్రామంలో హరిక్రిష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 25 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, గోపాల్ నాయక్, విరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

గూడూరు రూరల్: ప్రజలు తమ నివాస పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. గూడూరు పట్టణంలోని పలు కాలనీల్లో శనివారం ఆయన పర్యటించారు. వర్షాకాలం కావడంతో నివాస ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉంటే ప్రజలు అంటువ్యాధుల బారినపడే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీటిని కాచి వడబోసుకుని తాగాలని సూచించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి నగర పంచాయతీ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ రవి 9676654911ని సంప్రదించాలన్నారు. ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా ఉంటే స్థల యజమానులకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి

గూడూరు రూరల్: కుక్కలను పెంచుకుంటున్న యాజమానులు వాటికి వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని పశువైద్యశాల ఏడీ శివకుమార్ అన్నారు. శనివారం స్థానిక పశువైద్యశాలలో ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా రేబిస్ టీకాలు వేసినట్లు తెలిపారు. పెంపుడు జంతువులకు ఏవైనా వ్యాధులు, అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే పశువైద్యశాలకు తీసుకొస్తే వైద్యం చే స్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ధనుంజయ ఆచారి, వనిత, శ్రీనివాసులు పాల్గొన్నారు.



గూడూరులో కుక్కకు టీకా వేస్తున్న ఏడీ శివకుమార్

38 కుక్కలకు రేబిస్ టీకా

సి.బెళగల్: ప్రపంచ జూనొసిస్ డే సందర్భంగా సి.బెళగల్‌లోని పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేసినట్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలో మొత్తం 38 కుక్కలకు టీకాలు వేశామన్నారు. ప్రతి ఒక్కరూ పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని సూచించారు.



సి.బెళగల్: పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

సమాజ భాగస్వామ్యంతో డెంగీ నివారణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని పద్మచంద్ర నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జులై ఒకటి నుంచి 31వ తేది వరకు డెంగీ వ్యతిరేక మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ సంవత్సరం సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దామని అనే నినాదంతో నివారణ, నియంత్రణ చర్యలు వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్నట్లు వివరించారు. ఉన్నట్లుండి జ్వరం ఉధృతంగా రావడం, తలనొప్పి అధికంగా రావడం, కంటిలోపల నొప్పి, కంటి కదలికలు తగ్గడం, కన్ను కదలినప్పుడు నొప్పి ఎక్కువ అవడం, కండరాలు, కీళ్లనొప్పి, వాంతి అగునట్లు భ్రాంతి కలగడం, నోరు ఎండిపోవడం, ఎక్కువ దాహం కావడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ వ్యాధి ఆర్బోవైరస్ వల్ల సంక్రమిస్తుందని, ఒకరి నుంచి మరొకరికి ఏడిస్ ఈజిప్టై అనే దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఈ దోమలు పగలు మాత్రమే కుడతాయని, మన ఇంటి పరిసరాల్లో నీరు నిలిచేందుకు అవకాశం ఉండి ఆ నీరు కనీసం వారం రోజులు నిల్వ ఉంటే ఈ దోమలు వృద్ధి చెందుతాయని చెప్పారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డెమో శ్రీనివాసులు శెట్టి, ఏఎంఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

ఓర్వకల్లు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్ అన్నారు. శనివారం ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె, భైరాపురం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. స్టూడెంట్స్ కిట్ల పంపిణీ, పాఠశాల నిర్వహణ నిధుల వినియోగం, మనబడి నాడు-నేడు ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి గురించి హెచ్‌ఎంలను ఆరా తీశారు. లొద్దిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలల్లో నాసిరకం భోజనం పెడుతున్నారని ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో కొందరు అధికారుల దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత వంట ఏజెన్సీలకు సూచించారు. ప్రభుత్వం మెనూ ప్రకారమే విద్యార్థులకు రుచికరమైన, నాణ్యతతో కూడిన భోజనం వడ్డించాలని ఆదేశించారు. ఈ విషయంలో హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలని సూచించారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ఓంకార్‌యాదవ్

అల్లుకున్న నిర్లక్ష్యం!

పాణ్యం మండల కేంద్రంలోని దొంగు వద్ద లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్, వైర్ల చుట్టూ పిచ్చి మొక్కలు, తీగలు అల్లుకున్నాయి. ఏదైనా ప్రమాదం జరగకముందే విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–పాణ్యం



డాక్టర్ వైఎస్సార్ వజ్రోత్సవాల పోస్టర్ విడుదల

కర్నూలు(సెంట్రల్): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వజ్రోత్సవ వేడుకలను విజయంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో వజ్రోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ వేడుకలకు అఖిల భారత కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాజరు కానున్నట్లు చెప్పారు. విజయవాడలోని మంగళగిరిలో జరిగే ఈకార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాజీ మంత్రిమూలింటి మారెప్ప,అనంతరత్నం మాదిగ, సయ్యద్‌నవీద్,వెంకటసుజాత తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలి

కల్లూరు: పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే నగర శివారు కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకులు తారకేశ్వర్ రెడ్డి, రంగస్వామి కోరారు. శనివారం వారు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని మాధవి నగర్‌లో కలసి వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కర్నూలు మున్సిపాలిటీకి ఎక్కువగా కల్లూరు అర్బన్ వార్డుల నుంచే ఆదాయం వస్తుందన్నారు. అయితే, ఈ ప్రాంతానికి తాగునీటి సరఫరా మాత్రం సరిగా జరగడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, జగదీష్, రవికుమార్, మదనమోహనాచారి తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని డివిజనల్, మునిసిపల్, మండల కార్యాలయాల్లో కూడా జరుగుతుందని వెల్లడించారు.